




కల్యాణపులోవ స్పిల్‌వే నుంచి నదిలోకి విడుదలవుతున్న నీరు



అనకాపల్లి మండలం దిబ్బపాలెంలో నీటమునిగిన పంట పొలాలు



పాయకరావుపేట మండలం గుంటపల్లి ఆవ ప్రాంతంలో నీట మునిగిన వరి పొలాలు

కుండపోత

జిల్లా అంతటా భారీ వర్షాలు

- పొంగి ప్రవహిస్తున్న వాగులు, వంకలు
- జలాశయాలకు వరద, గేట్లు ఎత్తివేత
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- నీట మునిగిన వరి పొలాలు
- ముసురు వాతావరణంతో జనజీవనానికి అంతరాయం
- మరింత ఛిద్రమైన రోడ్లు, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు
- సముద్రంలో చేపల వేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరిక
- సహాయక చర్యల కోసం యంత్రాంగం అప్రమత్తం
- కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- ఫోన్ నంబర్లు 08924-226599, 08924-222888

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో జిల్లా అంతటా శనివారం రాత్రి నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం పగలు దఫదఫాలుగా వర్షం కురిసింది. సాయంత్రం తరువాత కూడా వర్షం కొనసాగుతూనే వుంది. వాతావరణ కేంద్రం హెచ్చరికల ప్రకారం రానున్న 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. సముద్ర తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంగా గాలులు వీచే అవకాశం వుందని, మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని అధికారులు స్పష్టం చేశారు. కాగా అల్పపీడన ప్రభావంతో జిల్లాలో గత వారం రోజుల నుంచి అడపా దడపా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. జలాశయాల్లోకి వరద వచ్చి చేరుతున్నది. బంగాళాతంలో మళ్లీ వాయుగుండం ఏర్పడి శనివారం రాత్రి నుంచి భారీ వర్షాలు కురుస్తుండడంతో వాగు, గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఆదివారం రోజంతా ముసురు వాతావరణం నెలకొనడంతో సాధారణ జనజీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. పల్లంగా వున్న పంట పొలాల్లో వర్షం నీరు నిలవడంతో చెరువులను తలపిస్తున్నాయి. మరో రెండు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

అనకాపల్లిలో శనివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నది. ఆదివారం సెలవు దినం కావడం, పైగా జోరున వర్షం కురుస్తుండడంతో ప్రజలు ఇళ్లకే పరిమితయ్యారు. దీంతో రహదారులపై జనసంచారం బాగా తగ్గిపోయింది. కొప్పాక వద్ద జాతీయ రహదారిపై వర్షం నీరు నిలిచిపోయి చెరువును తలపించింది. విజయరామరాజుపేట రైల్వే అండర్‌బ్రిడ్జి కింద నీరు నిలిచిపోవడంతో వాహనాలను లక్ష్మీదేవిపేట రైల్వే గేటు మీదుగా మళ్లించారు. అనకాపల్లి పట్టణం వద్ద శారదా నది ఉధృతంగా ప్రవహిస్తున్నది. స్నానాల ఘాట్ వద్ద మెట్లు మునిగిపోయాయి.



బీఎన్ రోడ్డులో బుచ్చెయ్యపేట మండలం బంగారుమెట్ట కూడలి వద్ద చెరువుని తలపిస్తున్న గోతులు

నేడు విద్యా సంస్థలకు సెలవు

అనకాపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున సోమవారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు ప్రకటించినట్టు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ ఆదేశాలను ఎవరైనా అతిక్రమించి పాఠశాలలను తెరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



భారీ గోతులు ఏర్పడి వర్షపు నీటితో నిండిన అనకాపల్లి సుంకరమెట్ట జంక్షన్ నుంచి విశాఖ వెళ్లే రోడ్డు

భీమునిపట్నం- నర్సీపట్నం (బీఎన్) రోడ్డులో బుచ్చెయ్యపేట మండలం విజయరామరాజుపేట వద్ద తాచేరు నదిపై డైవర్షన్ రోడ్డు మీదుగా వరద నీరు ప్రవహిస్తుండడంతో అప్రమత్తమైన అధికారులు శనివారం నుంచి వాహనాల రాకపోకలను నిషేధించారు. ఆర్టీసీ బస్సులను వేరే మార్గాల్లో మళ్లించారు. చిన్నపాటి వాహనాలు వడ్డాది కస్పా రోడ్డు నుంచి గౌరీపట్నం మీదుగా చోడవరం చేరుకుంటున్నాయి. దీంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.



చోడవరంలో కుండపోతగా వర్షం..

కోటవురట్ల మండలంలోని రామచంద్రపురం జంక్షన్ వద్ద శిథిలావస్థకు చేరిన పురాతన వంతెన ఆదివారం ఒకవైపునకు కుంగిపోయింది. దీంతో వంతెన మీదుగా వాహనాల రాకపోకలను అధికారులు నిషేధించారు. వాహనాలు వెళ్లకుండా ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేశారు. కొత్త వంతెన నిర్మించే వరకు డైవర్షన్ రోడ్డును అందుబాటులోకి తీసుకువస్తామని, సోమవారమే ఈ పనులు ప్రారంభిస్తామని ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు.

చోడవరం మండలంలోని కొన్ని పంచాయతీల్లో శనివారం రాత్రి కొద్దిసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పలు కాలనీలు, లోతట్టు ప్రాంతాలు నీటిముంపునకు గురయ్యాయి. సబ్బవరం మండలం ఆదిరెడ్డిపాలెం గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తున్నది.

కోటవురట్ల మండలంలో సర్పా, వరహా నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. సాగునీటి చెరువుల్లోకి నీరు చేరడంతో నిండుతున్నాయి.

నీట మునిగిన పంట పొలాలు

పాయకరావుపేట, నక్కపల్లి మండలాల సరిహద్దులోని ఆవలోకి భారీగా వరద నీరు చేరడంతో వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. గుంటపల్లి, నామవరం, గోపాలపట్నం, ఉద్దండపురం రెవెన్యూ పరిధిలో సుమారు 300 ఎకరాల్లో వరినాట్లు నీట మునిగినట్టు రైతులు చెబుతున్నారు. రాంబిల్లి మండలంలో సుమారు పది పంచాయతీల్లో 200 ఎకరాల్లో వరిపంట నీట మునిగినట్టు రైతులు చెబుతున్నారు. ఎగువ ప్రాంతాల్లో వున్న జలాశయాల గేట్లు ఎత్తడంతో మైనర్, మేజర్ శారదా నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అనకాపల్లి మండలం దిబ్బపాలెం పంచాయతీ పరిధిలో గైరమ్మ గెడ్డకు గండి పడడంతో దాదాపు 150 ఎకరాల్లో వరి పంట నీట మునిగింది.

మరింత దెబ్బతిన్న రోడ్లు

జిల్లాలో వారం రోజుల వ్యవధిలోనే మరోసారి భారీ వర్షాలు కురుస్తుండడంతో పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ రహదారులు పలుచోట్ల తీవ్రంగా దెబ్బతిన్నాయి. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్కసారి కూడా రహదారుల అభివృద్ధి, నిర్వహణ పనులకు నిధులు విడుదల చేయకపోవడంతో అడుగడుగునా గోతులు ఏర్పడి, అధ్వానంగా తయారయ్యాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే వర్షాకాలం మొదలు కావడంతో మరమ్మతులు కూడా చేయలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో వర్షాలతో రోడ్లపై ఉన్న గోతులు మరింత పెద్దవి అవుతున్నాయి. రోడ్లపై గోతుల్లో నీరు చేరడంతో రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

అధికారులు అప్రమత్తం....

వాయుగుండం ప్రభావంతో జిల్లాకు అతి భారీ వర్ష సూచనల నేపథ్యంలో అధికార యంత్రాంగం ... మిగతా 8వ పేజీలో

జిల్లాలో మూడు కమాండ్ కంట్రోల్ రూమ్‌లు

జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు సహాయ చర్యలు చేపట్టేందుకు కలెక్టరేట్‌తో సహా అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీఓ కార్యాలయాల్లో కమాండ్ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ విజయకృష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. అధిక వర్షాల కారణంగా ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా ప్రజలు కలెక్టరేట్‌లో 08924-226599, 08924-222888; అనకాపల్లి ఆర్డీఓ కార్యాలయంలో 9491998293, నర్సీపట్నం ఆర్డీఓ కార్యాలయంలో 7075356563 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందిస్తే, తక్షణమే సహాయ చర్యలు చేపడతామని కలెక్టర్ పేర్కొన్నారు.



అనకాపల్లిలో వద్ద పరవళ్లు తొక్కుతున్న శారదా నది

జలాశయాలకు వరద తాకిడి

- స్పిల్‌వే గేట్లు ఎత్తిన అధికారులు

(ఆంధ్రజ్యోతి- న్యూస్‌నెట్ వర్క్)


పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో జిల్లాలోని అన్ని జలాశయాల్లోకి వరద నీరు చేరుతున్నది. రైవాడ మినహా మిగిలిన అన్ని రిజర్వాయర్లు ఇప్పటికే పూర్తిగా నిండడంతో స్పిల్‌గేట్లు ఎత్తి, అదనపు నీటిని దిగువకు విడిచిపెడుతున్నారు. దీంతో శారదా, పెద్దేరు, బొడ్డేరు, వరహా, సర్పా, తదితర నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

తాండవలోకి 800 క్యూసెక్కుల వరద..

నాతవరం: పరివాహక ప్రాంతంలో రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో తాండవ రిజర్వాయర్‌లోకి వరద ప్రవాహం పెరిగింది. గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులుకగా, ఆదివారం సాయంత్రం 800 క్యూసెక్కుల వరద నీరు చేరుతున్నది. దీంతో ప్రాజెక్టు అధికారులు నీటిమట్టం 378 అడుగులకు మించకుండా చూస్తూ, రెండు స్పిల్‌వేట్లు అడుగు మేర ఎత్తి 1,240 క్యూసెక్కుల నీటిని దిగువకు, 300 క్యూసెక్కుల నీటిని పంట కాలువలకు విడుదల చేస్తున్నారు.

రైవాడకు 2 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

దేవరాపల్లి: ఎగువ ప్రాంతాల్లో రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో పినకోట చల్లగెడ్డ, సమ్మెద గెడ్డల నుంచి రైవాడ జలాశయంలోకి ఆదివారం రెండు వేల క్యూసెక్కుల వరద నీరు చేరుతున్నది. రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 114 మీటర్లుకాగా ఆదివారం సాయంత్రానికి నీటిమట్టం 111 మీటర్లకు పెరిగింది. నీటి మట్టం 113 మీటర్లకు దాటితే స్పిల్‌గేట్ల నుంచి నీటిని విడుదల చేస్తామని డీఈఈ సత్యంనాయుడు తెలిపారు.



నిండిన పెద్దేరు జలాశయం

పెద్దేరు నుంచి 350 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో

మాడుగుల రూరల్: మండలంలోని పెద్దేరు జలాశయంలోకి 300 క్యూసెక్కుల వరద నీరు చేరుతున్నది. గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు కాగా ఆదివారం సాయంత్రానికి 135.8 మీటర్లకు చేరింది. ఉన్నతాధికారుల ఆదేశానుసారం ఆదివారం రాత్రి ఎనిమిది గంటలకు జలాశయం గేటు ఎత్తి 350 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెడుతున్నారు. నదికి ఇరువైపులా వున్న గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశామని ఏఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

రావణాపల్లి ఫుల్

గొలుగొండ: మండలంలోని రావణాపల్లి రిజర్వాయర్ గరిష్ఠ నీటి మట్టం 358.9 కాగా ఎగువన వున్న అల్లూరిసీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలానికి చెందిన రాళ్లగెడ్డతోపాటు తురబాలగెడ్డల నుంచి 235 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. జలాశయం ఇప్పటికే నిండడంతో వచ్చిన నీరు వచ్చినట్టు పొర్లుకట్ట మీదగా దిగువకు పోతున్నది.

కల్యాణపులోవ గేట్లు ఎత్తివేత

రావికమతం: మండలంలోని కల్యాణపులోవ రిజర్వాయర్‌కు వరద ప్రవాహం కొనసాగుతున్నది. గరిష్ఠ నీటిమట్టం 460 అడుగులు కాగా, 220 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వుంది. ఇప్పటికే జలాశయం నిండడంతో గత మూడు రోజుల నుంచి అదనపు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఆదివారం రెండు గేట్లు ఎత్తి 200 క్యూసెక్కుల నీటిని సర్పా నదిలోకి విడిచిపెడుతున్నారు. ఏఈ సత్యనారాయణదొర, తహసీల్దార్ మహేశ్వరరావు రిజర్వాయర్‌ను పరిశీలించారు.

కోనాం నుంచి వెయ్యి క్యూసెక్కులు విడుదల

చీడికాడ: మండలంలోని కోనాం జలాశయంలో ఆదివారం 300 క్యూసెక్కుల వరద వస్తున్నది. గరిష్ఠ నీటిమట్టం 101.25 మీటర్లు కాగా ప్రస్తుతం 98.6 మీటర్లకు చేరుకుంది. ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండడంతో ఇరిగేషన్ అధికారులు ముందు జాగ్రత్త చర్యగా స్పిల్‌వే గేట్లు ఎత్తి 1,000 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.



కోనాం జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

ఏజెన్సీ ఘాట్ మార్గాల్లో వాహనాల రాకపోకలు బంద్

- నర్సీపట్నం- చింతపల్లి రూట్లో బస్సులు నిలిపివేతతో ప్రయాణికుల ఇక్కట్లు

పాడేరు/ నర్సీపట్నం రూరల్, సెప్టెంబరు 8: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో అల్లూరి సీతారామరాజు జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మూడు ప్రధాన ఘాట్ మార్గాల్లో వాహనాల రాకపోకలను నిషేధిస్తూ కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఘాట్ మార్గాల్లో చెట్లు, కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్నందున సోమ, మంగళవారాలు పాడేరు, అనంతగిరి, లంబసింగి ఘాట్ మార్గాలు మూసివేయాలని, ఆయా మార్గాల్లో వాహనాలను అనుమతించవద్దని రెవెన్యూ, పోలీస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కాగా ఏజెన్సీలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఘాట్ రోడ్డులో కొండ చరియలు విరిగి పడే ప్రమాదం ఉందన్న పోలీసుల హెచ్చరికల నేపథ్యంలో నర్సీపట్నం డిపో నుంచి చింతపల్లి రూట్‌లో వెళ్లే అన్ని బస్సులు ఆపేశారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి సోమవారం వరకు చింతపల్లి, సీలేరు, జీకేవీధి, దేవరాపల్లి, మొండిగెడ్డ, సీలేరు, భద్రాచలం బస్సులు ఆపేశారు. శరభన్నపాలెం బస్సులు కృష్ణాదేవిపేట వరకు మాత్రమే తిప్పారు. అకస్మాత్తుగా బస్సులు ఆపేయడంతో ఆయా రూట్లలోని ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. గంటల తరబడి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పడిగాపులు కాశారు. కొంత మంది ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి గమ్యస్థానాలకు చేరుకున్నారు.

భక్తిశ్రద్ధలతో వినాయక చవితి



హరిద్రవర్ణ పసుపు అలంకరణలో దర్శనమిస్తున్న చోడవరం స్వయంభూ విఘ్నేశ్వరుడు

చోడవరం/ నక్కపల్లి, సెప్టెంబరు 8: వినాయక చవితి ఉత్సవాలు శనివారం జిల్లా అంతటా ఘనంగా ప్రారంభం అయ్యాయి. వాడవాడలా గణేశుడి విగ్రహాలను ఏర్పాటు చేసి, భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చోడవరంలోని స్వయంభూ విఘ్నేశ్వరుడు హరిద్రవర్ణ పసుపు అలంకరణలో భక్తులకు దరమ్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. నక్కపల్లి మండలంలోని ఒడ్డిమెట్ట లక్ష్మీగణపతి ఆలయం వినాయక చవితి పర్వదినం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. సామాన్య భక్తులతోపాటు పలు రాజకీయ పార్టీల నాయకులు ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.



నక్కపల్లి మండలం ఒడ్డిమెట్టలో పూజలందుకుంటున్న లక్ష్మీగణపతి

పండగపూట విషాదం

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు యువకులు దుర్మరణం

- పాయకరావుపేట మండలంలో ఇద్దరు, రావికమతం మండలంలో ఒకరు..





మృతులు తరుణ్‌కుమార్‌స్వామి, రమణ



రామరాజు (ఫైల్ ఫొటో)

వినాయక చవితి పండుగ పూట జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు యువకులు మృతిచెందారు. పాయకరావుపేట మండలంలో ఇద్దరు, రావికమతం మండలంలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు.

పాయకరావుపేట/రూరల్, సెప్టెంబరు 8: వినాయక చవితి పండుగ పూట మండలంలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. దీంతో మృతుల స్వగ్రామాలైన గుంటపల్లి, రేఖవానిపాలెంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఈ ప్రమాదాలకు సంబంధించి పాయకరావుపేట సీఐ జి.అప్పన్న తెలిపిన వివరాలిలా వున్నాయి.

మండలంలోని నామవరం జంక్షన్‌వద్ద నక్కపల్లి నుంచి తుని వైపు వెళుతున్న బొలేరో వాహనం, శనివారం మధ్యాహ్నం అదే దిశలో ముందు వెళుతున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నది. దీంతో బొలేరో వాహనం అదుపుతప్పి అవతలి రోడ్డుపైకి దూసుకుపోయి పాయకరావుపేట నుంచి గుంటపల్లి వెళుతున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నది. ఈ ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలవ్వగా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. వీరిలో ద్విచక్రవాహనంపై వెళుతున్న గుంటపల్లికి చెందిన సుంకర తరుణ్‌కుమార్‌స్వామి చికిత్స పొందుతూ మృతిచెందాడు. మిగిలిన వారిని మెరుగైన చికిత్స కోసం కాకినాడ, విశాఖపట్నం ఆస్పత్రులకు తరలించారు. తరుణ్‌కుమార్‌స్వామి తండ్రి, అన్న గత ఏడాది మృతిచెందగా, ఇతను మోటారు మెకానిక్‌గా పనిచేస్తూ తల్లిని పోషిస్తున్నాడు. శనివారం జరిగిన ప్రమాదంతో ఇతను కూడా మృతిచెందడంతో తల్లి ఒంటరైందని బంధువులు తెలిపారు.

కాగా పాయకరావుపేట ... మిగతా 8వ పేజీలో

పొంగుతున్న నదులు, వాగులు

వాయుగుండం ప్రభావంతో ఉమ్మడి విశాఖ జిల్లాలో కురుస్తున్న వర్షాలకు నదులు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. పలు చోట్ల పంట పొలాలను ముంచెత్తాయి. కల్వర్టులు దెబ్బతిన్నాయి. చెరువులు, మినీ రిజర్వాయర్ల పొర్లుకట్టు పారుతున్నాయి..


గొలుగొండ: రావణాపల్లి రిజర్వాయర్ పొర్లుకట్టు నుంచి పారుతున్న నీరు


గూడెంకొత్తవీధి: కూలిపోయిన చామగెడ్డ వంతెన


అనకాపల్లి టౌన్: జలమయమైన అనకాపల్లి పీటీడీ కాంప్లెక్సు


రాంబిల్లి: నారాయణపురం వద్ద జోరుగా ప్రవహిస్తున్న మైనర్ శారదా నది


కోటవురట్ల: పాతరోడ్డు వద్ద పరవళ్ల తొక్కుతున్న వరహా నది


రాంబిల్లి: పంచదార్ల రాజుకోడూరులో వరి పొలాలు మునిగి పోయిన దృశ్యం


అరకులోయ: మాడగడ గ్రామంలో ఇళ్లలోకి వచ్చిన బురద

క్రైం... crime news

హార్డ్‌వేర్, పెయింట్స్ దుకాణంలో అగ్నిప్రమాదం

» రూ.40 లక్షల ఆస్తి నష్టం


హార్డ్‌వేర్ దుకాణంలో ఎగిసి పడుతున్న మంటలు

రావికమతం, సెప్టెంబరు 8: మండల కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం హార్డ్‌వేర్ అండ్ పెయింట్స్ దుకాణంలో భారీ అగ్ని ప్రమాదం జరిగి సుమారు రూ.40 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. రావికమతంలో దాచేపల్లి రామారావు(నానాజీ)కి చెందిన హార్డ్‌వేర్ అండ్ పెయింట్స్ దుకాణంలో వెల్డింగ్ పనులు చేస్తుండగా విద్యుత్ షార్టు సర్క్యూట్ జరిగి అగ్ని ప్రమాదం సంభవించిందని స్థానికులు అంటున్నారు. రెండు అంతస్తులలో ఉన్న పెయింట్‌లు, పీవీసీ పైపులు తదితర సామగ్రి దగ్ధమయ్యాయి. దీంతో మంటలు ఎగసిపడ్డాయి. ప్రమాద విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెంటనే చేరుకొని పైఅంతస్థులో మంటల్లో చిక్కుకున్న ఒక వ్యక్తిని ఎస్ఐ ధనుంజయనాయుడు సాహసంతో రక్షించారు. రావికమతం, చోడవరం అగ్నిమాపక శకటాలు వచ్చి మంటలను అదుపు చేశాయి. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు, టీడీపీ నాయకులు వచ్చి బాధితుడు రామారావును పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. దీనిపై జిల్లా కలెక్టరుతో మాట్లాడి నష్ట పరిహారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే బాధితుడికి భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట రావికమతం ఉప సర్పంచ్ గంజి మోదునాయుడు, ఎంపీటీసీ సభ్యులు సూర్యనారాయణ, నాగేశ్వరరావు, పులగాయల సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

సచివాలయ ఉద్యోగికి తీవ్ర గాయాలు

కొయ్యూరు, సెప్టెంబరు 8 : చింతాలమ్మ గుడి సమీపంలో శనివారం సాయంత్రం గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన ఘటనలో ఎం.మాకవరం గ్రామ సచివాలయ టెక్నికల్ అసిస్టెంట్ త్రినాథ్ తీవ్రంగా గాయపడ్డారు. మాకవరం నుంచి కృష్ణాదేవిపేట బైక్‌పై వెళుతున్న త్రినాథ్‌ను ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతని కుడికాలు రెండు చోట్ల విరిగింది. స్థానికులు సహచర ఉద్యోగులకు తెలియజేయడంతో రావణాపల్లికు చెందిన పవన్‌తో పాటు పంచాయతీరాజ్ జేఈఈ రామకృష్ణ నర్సీపట్నం ఆస్పత్రిలో చేర్పించారు. ఘటనపై బాధిత కుటుంబం కొయ్యూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మరింత కుంగిన రామచంద్రపురం వంతెన

» ఆర్అండ్‌బీ అధికారుల పరిశీలన

» నేటి నుంచి రాకపోకలు నిలుపుదల


కుంగిపోయిన వంతెనను పరిశీలిస్తున్న ఈఈ రమేశ్, అధికారులు

కోటవురట్ల, సెప్టెంబరు 8: మండలంలోని రామచంద్రపురం జంక్షన్ వద్ద వంతెన మరింత కుంగింది. రెండు నెలల క్రితం ఈ వంతెన కుంగడంతో హెచ్చరిక బోర్డులు పెట్టినా ఎవరు పట్టించుకోకుండా యథావిధిగా వాహనాలు నడిపారు. వర్షాలు కురుస్తుండడంతో ఆదివారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో భారీ వాహనం వెళ్లడంతో ఒకసారిగా వంతెన మూడు అడుగుల కుంగిపోయింది. సమాచారం తెలుసుకున్న ఆర్అండ్‌బీ ఈఈ రమేశ్, డీఈఈ నాగమోహనరావు, ఏఈ నారాయణరెడ్డి, అధికారులు, పోలీసులు వచ్చి పరిశీలించారు. వెంటనే వంతెన పక్కన డైవర్షన్ రోడ్డు నిర్మాణ పనులు విషయమై మంత్రి వంగలపూడి అనితతో అధికారులు ఫోన్‌లో మాట్లాడారు. తక్షణమే డైవర్షన్ పనులు ప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. సోమవారం నుంచి వాహనాల రాకపోకలను నిషేధించారు. ఈ వంతెనపై భారీ వాహనాలు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటుచేశారు. దీంతో నర్సీపట్నం నుంచి కోటవురట్ల మీదుగా రేవుపోలవం రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా నర్సీపట్నం ఆర్అండ్‌బీ ఈఈ రమేశ్ మాట్లాడుతూ రామచంద్రపురం వంతెన కుంగిపోవడం జరిగిందని, దీని స్థానంలో కొత్త వంతెననిర్మాణానికి ప్రభుత్వం రూ. రెండు కోట్లు, డైవర్షన్ రోడ్డు కోసం రూ.150లక్షలు మంజూరుకు ప్రతిపాదనలు పంపించామన్నారు. డైవర్షన్ రోడ్డు పనులు సోమవారం నుంచి ప్రారంభిస్తామన్నారు.వారితోపాటు ఎస్ఐ రమణయ్య టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు జానకిశ్రీనివాసరావు ఉన్నారు.

డీసీసీ అధ్యక్షుడిగా మీసాల సుబ్బన్న



నర్సీపట్నం, సెప్టెంబరు 8 : జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడుగా సీనియర్ నాయకుడు మీసాల సుబ్బన్నను ఏఐసీసీ నియమించింది. 1980వ సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన నుంచి అధికారంలో ఉన్నా.. లేకపోయినా.. పార్టీలోనే ఆయన కొనసాగుతున్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో నామినేటెట్ పోస్టులతో పాటు పార్టీలో అనేక కీలక పదవులు చేపట్టారు. మీసాల సుబ్బన్నను డీసీసీ ప్రెసిడెంట్‌గా నియమించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	85.00
లైవ్ ధర	105.00
విత్ స్కిన్	180.00
స్కిన్ లెస్	190.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524

ఎడతెరిపి లేని వాన

» జాతీయ రహదారిపై కొప్పాక వద్ద నిలిచిన వర్షపు నీరు

» ఇబ్బందులు పడ్డ వాహనచోదకులు

» పొంగి ప్రవహిస్తున్న శారదా, మైనర్, మేజర్ నదులు


అనకాపల్లి టౌన్: కొప్పాక వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 8: వాయుగుండం ప్రభావంతో జిల్లా కేంద్రమైన అనకాపల్లిలో శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు ఎడతెరిపి లేని వర్షం కురిసింది. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పట్టణంలో 35.0 ఎంఎం వర్షపాతం నమోదైనట్టు స్థానిక వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు తెలిపారు. పట్టణంలో జనజీవనం స్తంభించింది. జనాలు ఇళ్లల్లోంచి బయటకు రావడానికి సాహసించలేదు. ఆదివారం కావడంతో కూరగాయలు కొనుగోలు చేయడానికి బయటకు వచ్చిన ప్రజలు తడిసి ముద్దయి ఇంటికి చేరారు. లోతట్టు ప్రాంతాల వద్ద వర్షపునీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. జాతీయ రహదారిలోని కొప్పాక వద్ద విశాఖ వెళ్లే మార్గంలో వర్షపు నీరు రోడ్డుపై నిలిచిపోయి చెరువును తలపించింది. ఏలేరు కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. పీటీడీ కాంప్లెక్స్ ఆవరణలో వర్షపు నీరు నిలిచిపోయింది. డిపోలోకి వెళ్లే కార్మికులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి కింద వర్షపునీరు నిలిచిపోవడంతో భారీ వాహనాలు లక్ష్మీదేవిపేట రైల్వేగేటు మీదుగా రాకపోకలు సాగించాయి.

పరవళ్లు తొక్కుతున్న శారదా నది

పట్టణంలో ఉన్న శారదానది ఉధృతంగా ప్రవహిస్తోంది. వాయుగుండం ప్రభావం కారణంగా ఎగువన ఉన్న రిజర్వాయర్ల గేట్లను ఎత్తివేయడంతో శారదానదిలో వరదనీటి ప్రవాహం జోరందుకుంది. ఘాట్‌కు ముందు ఉన్న మెట్లు మునిగిపోయాయి.


ఎలమంచిలి: రామారాయుడుపాలెం వద్ద రోడ్డుపై దెబ్బతిన్న కల్వర్టు

ఉధృతంగా మేజర్, మైనర్ శారదా నదులు

రాంబిల్లి: వాయుగుండం ప్రభావంతో ఆదివారం సాయంత్రం నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురుస్తోంది. దీంతో మండలంలోని పలు గ్రామాల రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోయి కాలువలను తలపిస్తున్నాయి. వెంకటాపురం జంక్షన్ నుంచి రాంబిల్లి మీదుగా వాడనర్సాపురం వెళ్లే నేవీ రోడ్డులోని భారీ గోతులు వర్షపు నీటితో నిండిపోయి చెరువుల్లా తయారవ్వడంతో వాహనదారులు వాటిలో పడిపోయి ప్రమాదాలకు గురవుతున్నారు. ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో కొత్తూరు, నారాయణపురం వద్ద గల మేజర్, మైనర్ శారదా నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వాయుగుండం కారణంగా వాడనర్సాపురం, కొత్తపట్నం, వాడపాలెం, వెంకయ్యపాలెం, లోవపాలెం గ్రామాల సముద్ర కెరటాలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. ఆదివారం 21.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు.

దెబ్బతిన్న రామారాయుడుపాలెం కల్వర్టు

ఎలమంచిలి: వాయుగుండం కారణంగా కురుస్తున్న వర్షాలతో ఎలమంచిలిపట్టణంలోని పలు చోట్ల రోడ్లపై వర్షం నీరు నిలిచిపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు. వర్షాలకు మునిసిపాలిటీ రామారాయుడుపాలెం రోడ్డుపై ఉన్న కల్వర్టు దెబ్బతింది. యర్రవరం సమీపంలో పూడుకుపోయిన కాలువలను ఎక్స్‌కవేటర్‌తో ఏఈ గణపతి సుబ్బారావు తీయించారు. పట్టణంలోని పలు డ్రైన్‌లలో పూడికతీత పనులు చేపట్టారు.

పొంగుతున్న సర్పా, వరాహా నదులు

కోటవురట్ల : మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సర్పా, వరాహా నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వర్షానికి గెడ్డలు, వాగులు పొంగుతున్నాయి. రోడ్లన్నీ జలమయమయ్యాయి. పంట పొలాలు నీటితో కళకళలాడుతున్నాయి. చెరువుల్లోకి నీరు చేరుతున్నది. మండలంలో 23.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ జానకమ్మ తెలిపారు.

అధ్వానంగా విశాఖ రోడ్డు

భారీ గోతులతో చెరువును తలపిస్తున్న రహదారి

» రాకపోకలకు నరకయాతన పడుతున్న వాహనదారులు

» రాంగ్‌రూట్‌లో వాహనాల రాకపోకలు

» పట్టించుకోని అధికారులు, పాలకులు


పెట్రోల్ బంకు సమీపాన దెబ్బతిన్న రోడ్డు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 8 : ఇది ఏజెన్సీ ప్రాంతంలోని రహదారి కాదు.. అలాగే జిల్లాలోని మారుమూల గ్రామీణ ప్రాంత రహదారి అంతకంటే కాదు.. సాక్షాత్తూ జిల్లా కేంద్రమైన అనకాపల్లిలోని సుంకరమెట్ట జంక్షన్ నుంచి జాతీయ రహదారికి వెళ్లే మార్గం. రెండు నెలలుగా రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నా జీవీఎంసీ అధికారులు పట్టించుకోకపోవడంతో వాహనదారులకు ప్రాణసంకటంగా మారింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.మూడు కోట్లకు పైగా నిధులతో సుంకరమెట్ట జంక్షన్ నుంచి హైవే వరకు రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులను చేపట్టింది. ఈ పనుల్లో భాగంగా పాత చెరకుకాటా దాటిన తరువాత రోడ్డు విస్తరణకు ప్రైవేటు స్థలం అవసరం కావడంతో ఆ ప్రాంతంలో రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. అయినప్పటికీ అప్పటి ప్రజాప్రతినిధులు రోడ్డును ప్రారంభించేశారు. వర్షాలకు ఈ రహదారి పూర్తిగా ధ్వంసమై చెరువును తలపిస్తోంది. అనకాపల్లి నుంచి కొప్పాక, లంకెలపాలెం, అగనంపూడి, గాజువాక, విశాఖపట్నంలకు రోజుకు వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. పరవాడ ఫార్మాసిటీలోని కంపెనీలకు ఉద్యోగులు వెళ్లాలన్నా.. విశాఖకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేయాలన్నా.. లంకెలపాలెం, కూర్మన్నపాలెం, స్టీల్‌ప్లాంట్, గాజువాక ప్రాంతాల్లోని విద్యాసంస్థలకు ఈ మార్గమే గుండానే వెళ్లాలి. రహదారి గోతులమయం కావడంతో వాహనచోదకులు రాంగ్ రూట్‌లో పాత చెరకు కాటా సమీపం నుంచి జలగలమదుం జంక్షన్ వరకు వెళుతున్నారు. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనచోదకులు బిక్కుబిక్కుమంటూ వాహనాలు నడిపే పరిస్థితి నెలకొంది. రహదారి నిర్మాణంపై అధికారులు గాని, ప్రజాప్రతినిధులు గాని స్పందించడం లేదని వాహనచోదకులు వాపోతున్నారు. ఈ విషయమై జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడును వివరణ కోరగా.. రోడ్డు నిర్మాణానికి అవసరమయ్యే స్థలానికి సంబంధించి యజమానులతో ఉన్న సమస్య కొలిక్కి వచ్చిందన్నారు. త్వరలోనే రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు.

సినిమా షూటింగ్‌లకు ఏవోబీ అనుకూలం

» ప్రముఖ సినీ డైరెక్టర్ క్రిష్

» మాచ్‌ఖండ్ ప్రాజెక్టు, డుడుమ జలపాతాల సందర్శన


మాచ్‌ఖండ్ అధికారులతో మాట్లాడుతున్న ప్రముఖ డైరెక్టర్ క్రిష్

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 8: ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతం సినిమా షూటింగ్‌లకు ఎంతో అనుకూలంగా ఉంటుందని ప్రముఖ సినీ డైరెక్టర్ క్రిష్ జాగర్లమూడి రాధాకృష్ణ అన్నారు. అన్నీ కుదిరితే త్వరలో ఇక్కడ సినిమా షూటింగ్ చేస్తానని ప్రకటించారు. శనివారం డైరెక్టర్ క్రిష్, తన బృందంతో మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం, వించ్ హౌస్, డుడుమ జలపాతాలను సందర్శించారు. వించ్ మార్గంలో ప్రయాణించి జలవిద్యుత్ కేంద్రానికి చేరుకున్నారు. ప్రాజెక్టు అధికారులతో మాట్లాడి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు నిర్మాణం, వించ్ పనితీరు, ఎటువంటి రహదారి సౌకర్యం లేని రోజుల్లో ఇటువంటి ప్రాజెక్టును నిర్మించడంపై క్రిష్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. డుడుమ పరిసర ప్రాంతంలో షూటింగ్ అనుమతులపై ప్రాజెక్టు అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా క్రిష్ మాట్లాడుతూ సరిహద్దులో ప్రకృతి అందాలు ఎంతో బాగున్నాయని, సినిమా షూటింగులకు చాలా బాగుంటుందన్నారు. మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం పరిసర ప్రాంతాల్లో సినిమా షూటింగ్ చేసేందుకు అనుమతుల కోసం ఏపీజెన్‌కో వర్గాలను అడగడం జరిగిందని, అనుమతులు వస్తే ఈ ప్రాంతంలో షూటింగ్ చేయనున్నామని తెలిపారు. ప్రస్తుతం ఒడిశా రాష్ట్రం కోరాపుట్టు జిల్లాలో పలు ప్రదేశాల్లో ప్రముఖ నటి అనుష్క శెట్టితో క్రిష్ సినిమా షూటింగ్ చేస్తున్నారు

భక్తులతో ఒడ్డిమెట్ట ఆలయం కిటకిట


ఒడ్డిమెట్ట ఆలయంలో భక్తులతో నిండిపోయిన క్యూ లైన్లు

నక్కపల్లి, సెప్టెంబరు 8: మండలంలోని ఒడ్డిమెట్ట లక్ష్మీగణపతి ఆలయం వినాయక చవితి పర్వదినం సందర్భంగా శనివారం ఉదయం నుంచి రాత్రి వరకూ భక్తులతో కిటకిటలాడింది. కొండకు వెళ్లే మెట్లమార్గం, ఆలయంలో వున్న క్యూ లైన్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఏర్పాట్లను ఎండోమెంట్స్ ఇన్‌స్పెక్టర్ రాజు, ఈవోలు కిరణ్మయి, సాంబశివరావు, మురళీ పర్యవేక్షించారు. తొమ్మిది రోజులపాటు ఒడ్డిమెట్ట ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయని వారు చెప్పారు. నియోజకవర్గానికి చెందిన పలు పార్టీల నాయకుల స్వామివారిని దర్శించుకున్నారు.

ఎలమంచిలిలో చిక్కిన అలుగు

» స్వాధీనం చేసుకొని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టిన ఫారెస్టు అధికారులు


వేమగిరి అటవీ ప్రాంతంలో అలుగును విడిచిపెట్టిన అధికారులు

ఎలమంచిలి, సెప్టెంబరు 8: ఎలమంచిలి ఎగువ ఉన్న పెదపల్లి అటవీప్రాంతం నుంచి ఇటీవల కురిసిన వర్షాలకు శేషుగెడ్డలో కొట్టుకు వచ్చిన అలుగు ఎన్టీఆర్ కాలనీకి చెందిన యువకుడి చేతికి చిక్కింది. దీని గురించి అంతగా తెలియని ఈ యువకుడి వద్ద నుంచి మరో యువకుడు తీసుకోవడంతో విషయం బయటకు పొక్కింది. ఈ సమాచారం ఎలమంచిలి అటవీ శాఖ అధికారులకు తెలియడంతో ఆ యువకుడి నుంచి అలుగును స్వాధీనం చేసుకున్నారు. జిల్లా అటవీ అధికారుల ఆదేశానుసారం అలుగును ఎస్.రాయవరం మండలం వేమగిరి అటవీప్రాంతంలో శనివారం రాత్రి విడిచిపెట్టామని ఎలమంచిలి అటవీ అధికారి రమణ తెలిపారు.

చవితి వేడుకల్లో వెల్లివిరిసిన మత సామరస్యం

» వినాయకుడి విగ్రహం ఏర్పాటుకు ముస్లిం కుటుంబం సాయం


వినాయకచవితి పూజలో స్థానిక యువకులతో కలిసి పాల్గొన్న ముస్లిం కుటుంబీకులు

చోడవరం, సెప్టెంబరు 8: వినాయక చవితి వేడుకల్లో మత సామరస్యం వెల్లివిరిసింది. పట్టణంలోని ఎడ్ల వీధికి చెందిన షేక్ జానీ అనే ముస్లిం యువకుడి కుటుంబం వినాయకుడి పూజల్లో పాల్గొనడం విశేషం. షేక్ జానీకి ఇటీవల ఆర్మీలో ఉద్యోగం వచ్చింది. దీంతో వినాయక విగ్రహాన్ని తానే కొనుగోలు చేసి ఏర్పాటు చేయించాడు. ఈ సందర్భంగా జానీ, అతని సోదరుడు, తల్లి మండపంలో కూర్చొని గణపతి పూజల్లో పాల్గొన్నారు. హిందువులతో కలిసి వినాయకుడి వేడుకల్లో ఇలా ఓ ముస్లిం కుటుంబం ఉత్సాహంగా పాల్గొనడం ఆదర్శంగా నిలిచింది.

సింహాద్రి రెండో యూనిట్‌లో ఉత్పత్తి పునరుద్ధరణ

పరవాడ, సెప్టెంబరు 8 : సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ)లోని 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండో యూనిట్‌లో ఉత్పత్తిని ఆదివారం రాత్రి పునరుద్ధరించారు. ఇదే యూనిట్‌కు సంబంధించి బాయిలర్ ట్యూబ్‌ల్లో రంధ్రాలు ఏర్పడడంతో గురువారం ఉత్పత్తి అర్థంతరంగా నిలిచిపోయిన సంగతి తెలిసిందే. అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టి యూనిట్‌లో ఉత్పత్తిని పునరుద్ధరించారు. అలాగే నాలుగో యూనిట్‌లో ఉత్పత్తి శనివారం రాత్రి నిలిచిపోయింది. ఈ యూనిట్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో ఉత్పత్తి నిలిచిపోయింది. అధికారులు మరమ్మతు పనులు ప్రారంభించారు.

జాతీయ ఉత్తమ యోగా టీచర్‌గా పుల్లేటి సతీష్


జాతీయ స్థాయి అవార్డుతో పుల్లేటి సతీష్


చోడవరం,సెప్టెంబరు 8: పట్టణానికి చెందిన యోగా గురువు పుల్లేటి సతీష్‌కు జాతీయ ఉత్తమ యోగా ఉపాధ్యాయ అవార్డు లభించింది. గ్రామీణ ప్రాంతంలో యోగా శిక్షణ ఇవ్వడంతోపాటు విశేష ప్రాచుర్యం కల్పిస్తున్న సతీష్‌కు బెంగళూరుకు చెందిన ప్రముఖ శివజ్యోతి యోగ కేంద్రం 2024 సంవత్సరానికి జాతీయ స్థాయి ఉత్తమ యోగా ఉపాధ్యాయునిగా అవార్డును ప్రకటించింది. సతీష్‌కు అవార్డు రావడంపై యోగా శిక్షణ కేంద్రం చైర్మన్ పసుమర్తి అశోక్, ఉషోదయ విద్యాసంస్థల చైర్మన్ జెర్రిపోతుల రమణాజీ, పట్టణ పిల్లల వైద్యులు బంగారు కృష్ణ అభినందించారు.

ఓం గం గణపతయే నమః

- భక్తిశ్రద్ధలతో వినాయక చవితి ఉత్సవాలు
- ఇంటింటా ఆది దేవునికి విశేష పూజలు
- వీధివీధిన విగ్రహాల ప్రతిష్ఠతో కోలాహలం




అనకాపల్లిలో వివిధ రూపాల్లో కొలువుదీరిన స్వామి



పరవాడ ద్రాక్షపండ్లతో తయారుచేసిన వినాయకుడు

అనకాపల్లిటౌన్/కశింకోట/పాయకరావుపేట/ ఎస్.రాయవరం/ ఎలమంచిలి/ రాంబిల్లి/ పరవాడ/అచ్యుతాపురం, సెప్టెంబరు 8 : వినాయక చవితి వేడుకను శనివారం ప్రజలంతా అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రతి ఇంట్లో ఆది దేవుని విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. వీధివీధిన వెలసిన మండపాల్లో కొలువుదీరిన స్వామికి ఆరాధనలు జరుపుతున్నారు. అనకాపల్లిలోని శారదా కాలనీలో అతిపెద్ద వినాయక విగ్రహాన్ని వేంకటేశ్వరస్వామి అలంకరణలో ఐకాన్ యూత్ సభ్యులు ఏర్పాటు చేశారు. తాకా శివీధిలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రమాణ స్వీకారం చేస్తున్న వినాయక విగ్రహాన్ని, కస్పావీధిలో లక్ష్మీగణపతి ఆలయం, నూకాంబిక ఆలయం తదితర ప్రాంతాల్లో స్వామి విగ్రహాలను ఏర్పాటు చేశారు. పాయకరావుపేట మండల ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పాయకరావుపేటలోని పాండురంగస్వామి ఆలయం, మంగవరం రోడ్డులోని సీతారామాలయం, బృందావనంలోని దుర్గాలమ్మచెట్టు ఆలయం, కరణంగారి వీధి, పెదిరెడ్డివారివీధిలోని వరసిద్ధి వినాయక ఆలయాల్లో విశేష పూజలు జరిపారు. ఎలమంచిలి మండలంలో వినాయక చవితిని ప్రజలంతా అత్యంత ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని కొత్తపేట చిన్నరామాలయం వీధి, రైల్వే స్టేషన్ రోడ్డు, కొత్తపేట మిలట్రీకాలనీ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన స్వామి విగ్రహాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. వినాయక చవితిని ఎస్.రాయవరం మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వీధివీధిన వివిధ రూపాల్లో గణనాథుడు కొలువుదీరాడు. దీంతో ఆయా ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది. అలాగే మండల కేంద్రం పరవాడ బొంకులదిబ్బ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహం వద్ద ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మీశ్రీనివాస్ దంపతులతో పాటు మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు తదితరులు పూజలు నిర్వహించారు. వాడచీపురుపల్లి పంచాయతీ సామాజిక భవనం ఏర్పాటు చేసిన స్వామి విగ్రహంవద్ద మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు దంపతులు పూజలు జరిపారు. పరవాడ భూలోకమాంబ ఆలయ సమీపంలో యువకులు ద్రాక్షపళ్లతో తయారుచేసి విగ్రహం అందరినీ ఆకట్టుకుంది. సబ్బవరం మండలంలో చవితి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మొగలిపురంలో మాజీ ఎమ్మెల్యే, విశాఖ జిల్లా టీడీపీ అధ్యక్షుడు గండి బాబ్జీ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుల్లేపల్లిలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, యాతపాలెం, రావలమ్మపాలెంలో వైస్ ఎంపీపీలు ఝాన్సీలక్ష్మీరాణి, సీహెచ్.గోవింద, జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు ఎస్‌టీ రామకాసు స్వామికి పూజలు జరిపారు. రాంబిల్లి మండలంలో గ్రామగ్రామాన వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. రాంబిల్లి, దిమిలి, లాలంకోడూరు, అప్పన్నపాలెం, పంచదార్ల, అప్పారాయుడుపాలెం, వైలోవ, పెదకలవలాపల్లి,వెల్చూరు, రాజుకోడూరు, కృష్ణంపాలెం, హరిపురం, వెంకటాపురం నారాయణపురం గోకివాడ, వాడనర్సాపురం, కొత్తపట్నం తదితర గ్రామాల్లో స్వామివారిని భక్తిశ్రద్ధలతో ఆరాధించారు. ప్రముఖ శైవక్షేత్రం పంచదార్లలోని ఉమాధర్మలింగేశ్వర ఆలయంలో, ఫణిగిరిపైన ద్విముఖ వినాయకుని ఆలయంలో కూడాపూజలు జరిపారు. అచ్యుతాపురం మండలంలో వినాయక చవితిని అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వీధివీధిన ఏర్పాటైన మండపాల్లో స్వామి కొలువుదీరారు. ఇదిలావుంటే, ఎంజేపురంలో ఏకంగా మూడు నెలల పాటు వినాయకునికి పూజలు నిర్వహిస్తారు. గ్రామంలో మరెక్కడా వినాయక మండపాలను ఏర్పాటు చేయరు. ఇక్కడఒకే విగ్రహాన్ని ఏర్పాటు చేసి అంతా పూజలు నిర్వహిస్తారు.

పండగపూట విషాదం

... 5వ పేజీ తరువాయి

పట్టణంలోని కనోసా స్కూల్ ఎదుట జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం తుని వైపు వెళుతున్న ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి వస్తున్న లారీ బలంగా ఢీకొన్నది. దీంతో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న కాకినాడ జిల్లా తుని మండలం రేఖవానిపాలెం గ్రామానికి చెందిన కొల్లాపూర్ రమణ(25) అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ రెండు సంఘటనలపై కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ అప్పన్న తెలిపారు.

బైక్‌లు ఢీకొని యువకుడి మృతి

రావికమతం: మండలంలోని మత్సవానిపాలెం కాటా వద్ద బీఎన్ రోడ్డులో శనివారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఒక యువకుడు మృతిచెందగా మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. కొత్తకోట ఎస్ఐ లక్ష్మణరావు తెలిపిన వివరాల ప్రకారం.. రావికమతం మండలం టి.అర్జాపురం గ్రామానికి చెందిన అద్దేపల్లి రామరాజు(28), మత్స రామునాయుడు శనివారం రాతి దొండపూడి వెళ్లి ద్విచక్రవాహనంపై ఇంటికి తిరిగి వస్తున్నారు. ఇదే గ్రామానికి చెందిన కొశిరెడ్డి సువర్ణరాజు, పేరపు శివ అర్జాపురం నుంచి దొండపూడి వైపు ద్విచక్రవాహనంపై వెళుతున్నారు. దారిలో మత్సవానిపాలెం ఫాల్గుణ కాటా వద్ద ఎదురెదురుగా వచ్చిన బైకులు బలంగా ఢీకొన్నాయి. దీంతో నలుగురూ తీవ్రంగా గాయపడడంతో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. రామరాజు పరిస్థితి విషమంగా వుండడంతో వైద్యుల సూచన మేరకు విశాఖ కేజీహెచ్‌కు తరలిస్తుండగా దారిలో మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు.

కుండపోత!



కోటవురట్ల మండలం పాతరోడ్డు వద్ద పరవళ్లు తొక్కుతున్న వరహా నది

... 5వ పేజీ తరువాయి

అప్రమత్తమైంది. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అవసరం మేరకు ప్రజలకు సేవలందించేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను (ఫోన్ నంబర్లు 08924-226599, 08924-222888) ఏర్పాటు చేసి, మండలాల నుంచి వర్షాలు, ప్రజల ఇబ్బందులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. మండల అధికారులు ఆయా కేంద్రాల్లోనే అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి సిబ్బందిని అందుబాటులో ఉంచారు.

74 మి.మీ.ల వర్షం

జిల్లాలో శని, ఆదివారాల్లో సగటున 74 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. శనివారం ఉదయం 8 గంటల నుంచి ఆదివారం ఉదయం 8 గంటల వరకు సగటు వర్షపాతం 12.8 మిల్లీ మీటర్లు కాగా ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు 61.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. రెండు రోజులు కలిపి అత్యధికంగా దేవరాపల్లి మండలంలో 128 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కశింకోట మండలంలో 100 మిల్లీ మీటర్లు, ఎలమంచిలిలో 92.7, రావికమతంలో 87.2, పాయకరావుపేటలో 83.6, పరవాడలో 83.3, ఎస్.రాయవరంలో 83, కె.కోటపాడులో 79.5, మునగపాకలో 79.5, సబ్బవరంలో 77.6, అనకాపల్లిలో 75.3, చోడవరంలో 74, నక్కపల్లిలో 71.5, అచ్యుతాపురంలో 70.4, గొలుగొండలో 68.6, చీడికాడలో 68.6, రోలుగుంటలో 68.8, కోటవురట్లలో 65.1, మాడుగులలో 64.4, రాంబిల్లిలో 59.6, నాతవరంలో 57, మాకవరపాలెంలో 53.9, నర్సీపట్నంలో 45.9, బుచ్చెయ్యపేటలో 41.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

నేడు పరవాడ మండల సమావేశం

పరవాడ, సెప్టెంబరు 8 : ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం జరగనుందని ఎంపీడీవో హేమసుందరరావు తెలిపారు. ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు హాజరవుతారన్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొనాల్సిందిగా కోరారు.



అనకాపల్లిలోని శంకరం వద్ద నీట మునిగిన పంట పొలాలను పరిశీలించి నాయకులతో మాట్లాడుతున్న కొణతాల



రాంబిల్లి మండలం రాజాల సమీపంలోని ఏడుముళ్ళ శారదా నదిగట్టు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్



పాయకరావుపేటలో భూమి ఆనకట్ట వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న తాండవ నదిని పరిశీలిస్తున్న సీఐ అప్పన్న

వీడని ముసురు

- అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- గ్రామీణ రహదారులు చిత్తడి
- అవస్థలు పడుతున్న జనం
- పలు ప్రాంతాల్లో పర్యటించిన అధికారులు



పరవాడలో నీట మునిగిన వరి పొలాలు



అచ్యుతాపురం మండలం పూడిమడకలో నీట మునిగిన ఉప్పు మడులు



కశింకోట మండలం తాళ్లపాలెం కూడలిలో చెరువును తలపించేలా చేరిన వర్షపు నీరు



అనకాపల్లి మండలం మూలపేట గ్రామంలో ప్రజలతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి తహసీల్దార్

తుమ్మపాల, సెప్టెంబరు 8 : బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావం కారణంగా అనకాపల్లి మండలంలోని ఎడతెరిపి లేని వర్షం కురుస్తోంది. శనివారం రాత్రి నుంచి ప్రారంభమైన వర్షం ఏకధాటిగా పడుతూనే ఉంది. ఇళ్లలోంచి ప్రజలు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. దిబ్బపాలెం పంచాయతీ పరిధిలో ఉధృతంగా ప్రవహిస్తున్న శారదా నదికి అనుసంధానమైన గైరమ్మ వాగు గెడ్డకు గండి పడడంతో భారీగా వరద పంట పొలాల్లోకి చేరింది. దాదాపు 150 ఎకరాల్లో పంట నీట మునిగింది. దీంతో రైతులంతా లబోదిబోమన్నారు. శంకరం, తుమ్మపాల, బొజ్జన్నకొండ ప్రాంతాల్లో నీట మునిగిన వరి పొలాలను అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆదివారం పరిశీలించారు. స్థానిక నాయకులు, రైతులతో పాటు అధికారులతో మాట్లాడారు. తుమ్మపాల గుండా ప్రవహించే పంట పొలాల్లో పూడికలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కొత్తూరు : అనకాపల్లి మండలం సత్యనారాయణపురం, మూలపేట గ్రామాల్లో ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీరామ్మూర్తి ఆదివారం రాత్రి పర్యటించారు. ఆయా గ్రామస్థులతో మాట్లాడారు. ప్రస్తుతం రైవాడ జలాశయం నీటి మట్టం 111.00 సమీపంలో ఉందన్నారు. జలాశయం నీటమట్టం 113.00 చేరువలోకి వస్తే స్పిల్‌వే గేట్లు తెరిచి నదిలోకి నీటిని విడిచిపెట్టడం జరుగుతుందన్నారు. అందువల్ల నదీ పరీవాహక ప్రాంతాలైన అనకాపల్లి, కశింకోట, మునగపాక, యలమంచిలి, రాంబిల్లి తదితర మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. సంబంధిత పంచాయతీ, రెవెన్యూ, పోలీసు అధికారులు ప్రజలను అప్రమత్తం చేసి ఇప్పటికే గ్రామాల్లో దండోరా వేయించినట్టు చెప్పారు. ఆయన వెంట ఆర్ఐ రమేష్, వీఆర్వోలు శ్రీను, మూర్తి తదితరులు ఉన్నారు.

కశింకోట : అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు కూడళ్లు వర్షపునీటితో నిండిపోయి చెరువును తలపిస్తున్నాయి. పంటపొలాల్లో భారీగా నీరు చేరింది. శనివారం 43.2 మిల్లీమీటర్లు, ఆదివారం ఉదయం 8.30 నుంచి సాయంత్రం ఐదుగంటల వరకు 40.6 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇదిలావుంటే, శారదానది పరీవాహక ప్రాంతాల్లో ఉన్న ప్రజలు, రైతాంగమంతా అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో ఎ.రవికుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం వారు శారదానది పరీవాహక ప్రాంతాల్లో ఉన్న ప్రజలతో మాట్లాడారు. నది నుంచి నీరు మరింత ఉధృతంగా ప్రవహించే అవకాశముందని దీంతో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పాయకరావుపేట : భారీ వర్షాల కారణంగా పాయకరావుపేటలో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. శనివారం నుంచి ఆదివారం రాత్రి వరకు వర్షం కురుస్తూనే ఉంది. దీంతో పనులపై బయటకు వచ్చిన ప్రజలు తడిసి ముద్దయ్యారు. పలు వీధుల్లో ఉన్న పాత ఇళ్లు కట్టడాలు పూర్తిగానాని ప్రమాదకంగా మారడంతో వాటిలో నివాసముంటున్నవారు ఆందోళన చెందుతున్నారు. ఇదిలావుంటే, ఆదివారం సాయంత్రం తాండవ రిజర్వాయర్ అధికారులు మూడు గేట్లు ఎత్తి నీటిని నదిలోకి విడిచిపెట్టారు. సీఐ జి.అప్పన్న తాండవ నదిలో ఆనకట్టల వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. అనంతరం ముందస్తు చర్యల్లో భాగంగా తాండవ నదిని ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు.

పాయకరావుపేట రూరల్ : వాయుగుండం కారణంగా మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పాయకరావుపేట, మంగవరం, సత్యవరం, మాసాహెబ్‌పేట, గోపాలపట్నం, పెంటకోట, పెదరాంభద్రపురం, కుమారపురం, శ్రీరాంపురం, అరట్లకోట, వెంకటనగరం తదితర గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఇదిలావుంటే, ఉద్దండపురం, గొడచెర్ల తదితర ఎగువ ప్రాంతాల నుంచి ఆవలోకి చేరుతున్న నీటికి ఆవ ప్రాంతంలోని వరి పంటలు నీట మునిగాయి. గుంటపల్లి, నామవరం, గోపాలపట్నం, ఉద్దండపురం రెవెన్యూ పరిధిలోని సుమారు 250 నుంచి 300 ఎకరాల వరిచేను నీట మునిగినట్లు రైతులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వమే తమను ఆదుకోవాల్సిందిగా వారంతా కోరుతున్నారు.

నక్కపల్లి : మండలంలో రెండు రోజుల నుంచి కుండపోతగా వర్షం కురుస్తోంది. లోతట్టు ప్రాంతాల్లో భారీగా నీరు నిలిచిపోయింది. దీంతో రాకపోకలకు జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంటపొలాల్లో నీరు భారీగా చేరింది. చెరువులు, పంట కాలువలు జలకళను సంతరించుకున్నాయి. శనివారం ఒక్కరోజే మండలంలో సుమారు ఆరు సెం.మీ. వర్షపాతం నమోదైంది. తీర ప్రాంతాల్లో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

ఎస్.రాయవరం : మండలంలో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు 22.6 ఎంఎం, ఆదివారం ఉదయం నుంచి సాయంత్రంనాలుగున్నర గంటల వరకు 27.4 ఎంఎం వర్షపాతం నమోదయ్యిందని తహసీల్దార్ కె.విజయకుమార్ తెలిపారు. లోతట్టు ప్రాంతాలతో పాటు పంట పొలాల్లోనూ భారీగా నీరు చేరింది.

అచ్యుతాపురం : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శనివారం సాయంత్రం ప్రారంభమైన వాన ఆదివారం రాత్రంతా కురుస్తూనే ఉంది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అచ్యుతాపురం మండలంలో ఆదివారం 36.2 ఎంఎం వర్ష పాతం నమోదైంది. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లలేదు. పూడిమడక వద్ద ఉన్న ఉప్పు గల్లీల్లో వర్షపు నీరు చేరడంతో చెరువును తలపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల రహదారులు చిత్తడిగా మారాయి.

పరవాడ :మండల వ్యాప్తంగా ఆదివారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురుస్తోంది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. స్థానిక పైడిమాంబ ఆలయ సమీపంలోని ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిలిచిపోయింది. పరవాడలోని పలుచోట్ల వరి పొలాలు నీట మునిగాయి. జాజులవానిపాలెం వద్ద ప్రధాన రహదారి పైనుంచి నీరు పారుతోంది. పరవాడ మల్లోడిగెడ్డ ఉధృతంగా ప్రవహిస్తోంది. అలాగే, పెద్ద చెరువు, పైడమ్మ బంద చెరువు నిండిపోయాయి. పెద్ద చెరువు కళింగ పైనుంచి నీరు ఉధృతంగా పారుతోంది. ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీరాల్లో అలలు ఎగసి పడుతున్నాయి. మత్స్యకారులు వేటకు వెళ్లకుండా ఇంటికే పరిమితమయ్యారు.

రాంబిల్లి : భారీ వర్షాల కారణంగా మండలంలోని ప్రధాన మేజర్, మైనర్ శారదా నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఇక్కడ బలహీనంగా ఉన్న గట్లను ఆదివారం ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పరిశీలించారు. మూడు కిలోమీటర్ల దూరం బురదలో నడిచి వెళ్లి రజాల వద్ద ఏడుముళ్ళ శారదా నదిగట్టును పరిశీలించి రైతులతో అక్కడి పరిస్థితుల గురించి మాట్లాడారు. బలహీనంగా ఉన్న నదుల గట్లను గుర్తించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సబ్బవరం : గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. సాగునీటి చెరువుల్లో భారీగా నీరు చేరింది. పలు గ్రామాల్లో వరి చేలు నీట మునిగాయి. ఆదిరెడ్డిపాలెం గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తుంది. సబ్బవరంలోని జాతీయ రహదారి పైకి వర్షపునీరు చేరుకుంది. ప్రజలు ఇళ్లలోంచి బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు 37.2 ఎంఎం వర్షం కురిసింది. పంటలకు నష్టం వాటిల్ల లేదని అధికారులు తెలిపారు.

‘పంచాయతీ కార్యదర్శుల బదిలీలు అస్తవ్యస్తం’



నిరసన తెలియజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

తుమ్మపాల, సెప్టెంబరు 8 : ఉమ్మడి విశాఖ జిల్లాలో పంచాయతీ కార్యదర్శుల బదిలీలు అస్తవ్యస్తంగా మారాయని ఉమ్మడి జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు కె.నాగేశ్వరరావు, వై.యోగి, ఎస్.రాజేష్ ఆరోపించారు. ఆదివారం అనకాపల్లిలో పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామ పంచాయతీల్లో కార్యదర్శుల బదిలీలు శాస్త్రీయంగా లేకపోవడంతో కార్యదర్శులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈకారణంగా ఏజెన్సీ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న వారు మైదాన ప్రాంతాలకు రావడం, మైదాన ప్రాంతాల్లో ఉన్న కార్యదర్శులు ఏజెన్సీ పంచాయతీల్లో విధులు నిర్వహించాల్సిన దుస్థితి దాపురించిందని ఆరోపించారు. గ్రామ పంచాయతీ గ్రేడ్‌ల పునర్ విభజన, జనాభా, ఆదాయం ప్రతిపాదిక ప్రణాళికలు సిద్ధం చేసిన అనంతరమే ఉమ్మడి విశాఖ జిల్లాలో పంచాయతీ కార్యదర్శుల బదిలీలను చేపట్టాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు ముహూర్తపు రాట



మూహూర్త రాటలో పాల్గొన్న రత్నాకర్ దంపతులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 8 : పట్టణంలోని గవరపాలెం పీలా వెంకటరెడ్డినాయుడు వీధిలో శివశక్తి ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి ఆదివారం ముహూర్తపు రాట వేశారు. కమిటీ చైర్మన్ పీలా రామచంద్రరావు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు దాడి రత్నాకర్, అచ్యుత దంపతులు పూజలు నిర్వహించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా రేపు

ఎలమంచిలి, సెప్టెంబరు 8 : ఇక్కడి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 10వ తేదీ మంగళవారం ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి టి.చాముండేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మూడు పరిశ్రమల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

వర్షాల కారణంగా సదరం క్యాంపు వాయిదా

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 8 : అల్పపీడనం కారణంగా వర్షాలు కురుస్తుండడంతో సోమవారం నుంచి జరగాల్సిన సదరం క్యాంపును వాయిదా వేసినట్టు ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణం అనుకూలించిన తరువాత తిరిగి వచ్చే మంగళవారం 17వ తేదీ నుంచి ఈ క్యాంపు యథాతథంగా కొనసాగుతుందని వివరించారు.

లక్ష్మీగ్రంథాలయం నూతన కమిటీ ఎన్నిక

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 8 : లక్ష్మీదేవిపేటలోని లక్ష్మీగ్రంథాలయం నూతన కమిటీ ఆదివారం ఏర్పాటైంది. గౌరవాధ్యక్షునిగా కర్రి గోపి, ఉపాధ్యక్షులుగా ఇసరపు నరసింగరావు, కార్యదర్శిగా బూడిద నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా ఆడారి ప్రభాకరరావు, కోశాధికారిగా కొణతాల మాణిక్యాలరావులు ఎన్నికయ్యారు. కార్యవర్గసభ్యులుగా 12 మందిని ఎన్నుకున్నారు. గ్రంథాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కొణతాల సన్యాసిరావు, సలహాదారులు బుద్ధ భాస్కర్, ముప్పన లింగేశ్వరరావు, ఆడారి రవిబాబు, పి. అప్పారావు, భర్ణికాన నరసింహమూర్తి పాల్గొన్నారు.

తోట నగేశ్‌కు జాతీయ స్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న తోట నగేశ్

పాయకరావుపేట, సెప్టెంబరు 8 : సామాజిక సేవలందించే వ్యక్తులకు ఢిల్లీకి చెందిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ మెమోరియల్ అందించే జాతీయ స్థాయి అవార్డు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్‌కు వరించింది. ఈనెల ఐదున న్యూఢిల్లీలో జరిగిన ఆదిలీల గురు బహ్మోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆదిలీల ఫౌండేషన్ ప్రతినిధులు తనకు ఈ అవార్డును అందజేసి సత్కరించినట్టు నగేష్ ఆదివారం ఇక్కడి విలేకరులకు తెలిపారు.

అచ్యుతాపురంలో పూర్వ విద్యార్థుల కలయిక



అచ్యుతాపురం ఉన్నత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

అచ్యుతాపురం, సెప్టెంబరు 8 : మండల కేంద్రం అచ్యుతాపురంలోని ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఆదివారం సందడి చేశారు. 2007-2008 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వారిలో ఎనభై మంది ఓ చోట కలుసుకోవడతో కోలాహల వాతావరణం నెలకొంది. తొలుత ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. ఆ తరువాత ఉదయం నుంచి సాయంత్రం వరకు సరదాగా గడిపారు. ఇకపై ఏటా ఇలా సమావేశం కావాలని నిర్ణయించుకున్నారు.

టీడీపీకి యాదవులతో చక్కని అనుబంధం

ప్రతిభా పురస్కారాల ప్రదానంతో ఎమ్మెల్యే కొణతాల



విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందజేస్తున్న కొణతాల

కొత్తూరు, సెప్టెంబరు 8 : టీడీపీకి యాదవులతో విడదీయరాని అనుబంధం ఉందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. అనకాపల్లి పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో ఆదివారం జిల్లా స్థాయి సమావేశంతో పాటు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ యాదవులతో సహా బలహీన వర్గాలకు చెందిన పలువురు తమను బీసీ- డి నుంచి బీసీ-బిలోకి తీసుకు రావాలని కోరుతున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా బీసీల జనాభా పూర్తిగా తేలాల్సి ఉందన్నారు. అందులో కులాల వారీగా జనాభా వివరాలు తెలిస్తే.. అందుకు అనుగుణంగా బీసీ రిజర్వేషన్లు పెంచడానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్‌లను కోరవచ్చన్నారు. అనంతరం పదో తరగతిలో ప్రతిభ చూపిన రెండు వందల మంది విద్యార్థులకు పారితోషకాలు, ప్రోత్సాహకాలను అందజేశారు. కొణతాలను అఖిల భారతీయ యాదవ సంఘం అధ్యక్షుడు భరణికాన రామారావు, జిల్లా అధ్యక్షుడు భరణికాన సాయినాథరావు తదితరులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు భరణికాన నర్సింహమూర్తి, సబ్బి శ్రీనివాసరావు, కరక సోమునాయుడు, దేవర సత్యనారాయణ, కురందాసు నూకరాజు, గోకివాడ కోటేశ్వరరావు, వియ్యపు అప్పారావు, పంచదార్ల కన్నారావు, పంచదార్ల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

360 మందికి కంటి వైద్య పరీక్షలు

అచ్యుతాపురం, సెప్టెంబరు 8 : బ్రాండిక్స్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాలు విజయవంతంగా కొనసాగుతూనే ఉన్నాయి. ఇందులో భాగంగా ఆదివారం వర్షం కురుస్తున్నప్పటికీ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 360 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇటీవల పరీక్షలు జరిపిన 245 మందికి ఉచితంగా కంటి అద్దాలు అందజేశారు. 38 మందికి కేటరాక్ట్ ఆపరేషన్లు అవసరమని వైద్యులు నిర్ధారించారు. వీరందరికీ ఉచింతగా ఆపరేషన్లు చేయిస్తామని బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరస్వామి తెలిపారు. ఈ శిబిరాన్ని ఆయన దగ్గరుండి పర్యవేక్షించడంతో పాటు రోగులకు వాహనాలను ఏర్పాటు చేసి, భోజనం సమకూర్చారు.

చమ్మచింతలో జ్వరాల విజృంభణ

- గ్రామంలో 150 మంది వరకు జ్వరపీడితులు
- నాతవరం, నర్సీపట్నం ఆస్పత్రుల్లో చికిత్సలు
- వైద్య శిబిరం ఏర్పాటుకు వేడుకోలు


నాతవరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్న చమ్మచింత జ్వరపీడితులు

నాతవరం, సెప్టెంబరు 8 : మండలంలోని చమ్మచింత గ్రామాన్ని జ్వరాలు వీడడం లేదు. ఇంటింటా జ్వరపీడితులు మంచానపడి మూలుగుతున్నారు. సుమారు 150 మంది వరకు జ్వరాలతో బాధపడుతున్నారు. నాతవరం, నర్సీపట్నంలలోని ఆస్పత్రులకు వెళ్లి చికిత్సలు పొందుతున్నారు. ఆర్థిక స్థోమత లేనివారు మందులు కొని మింగుతున్నారు. నాతవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు వెంటనే స్పందించి గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా అంతా కోరుతున్నారు. ఇదిలావుంటే, గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని పలువురు వాపోతున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించాల్సిందిగా కోరుతున్నారు.

రిటైర్డు హెచ్ఎంకు ఘన సత్కారం


వీరమాంబను సత్కరిస్తున్న డిప్యూటీ డీఈవో

నర్సీపట్నం, సెప్టెంబరు 8 : మునిసిపాలిటీలోని వెంకునాయుడుపేట ఎంపీపీ స్కూల్‌లో ప్రధానోపాధ్యాయురాలిగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన మీసాల వీరమాంబను డిప్యూటీ డీఈవో పి.అప్పారావు ఘనంగా సన్మానించారు. ఆదివారం ఇక్కడ జరిగిన ఈ కార్యక్రమానికి పీఆర్‌టీయూ ఉమ్మడి విశాఖ జిల్లా కన్వీనర్ డీజీనాథ్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో తలుపులు, అడిగర్ల వరహాలనాయుడు, జీవీ రమేశ్, కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.


నర్సీపట్నంలో వర్షం కురుస్తున్న దృశ్యం


వర్షానికి బురదమయంగా మారిన మాకవరపాలెం బస్‌స్టాండ్

జడివాన

- అల్పపీడనంతో రెండు రోజులుగా వర్షాలు
- స్తంభించిన జనజీవనం
- లోతట్టు ప్రాంతాలు జలమయం


ఏఎల్‌పురం-పాతకృష్ణాదేవిపేట రోడ్డు దుస్థితి


గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలో ఉధృతంగా ప్రవహిస్తున్న బొడ్డేరు గెడ్డ

నర్సీపట్నం/నర్సీపట్నం రూరల్, సెప్టెంబరు 8 : అల్పపీడనం కారణంగా నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం తెల్లవారు జాము నుంచి ఏకధాటిగా పడుతుడడంతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లోతట్టు ప్రాంతాల్లో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయింది. పంట పొలాల్లో భారీగా నీరు చేరింది. ఇదిలావుంటే, మునిసిపాలిటీలోని ప్రశాంతినగర్, బ్యాంక్ కాలనీ, లక్ష్మీనగర్, శివపురం తదితర ప్రాంతాలలోని మట్టి రోడ్లు చిత్తడిగా తయారు కావడంతో జనం అవస్థలు పడుతున్నారు.నర్సీపట్నం మండంలోని 12 పంచాయతీలలో వరి పంటకు ఎటువంటి ఇబ్బంది లేదని ఏవో అప్పారావు తెలిపారు.

కృష్ణాదేవిపేట : అల్పపీడనం కారణంగా శనివారం సాయంత్రం నుంచి గొలుగొండ మండలంలో వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. గొలుగొండ, ఏఎల్‌పురం, చోద్యం, పాతకృష్ణాదేవిపేట, లింగంపేట, నాగాపురం, కొంగసింగి తదితర ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాల్లో ఎటుచూసినా వర్షంపు నీరే కనిపిస్తోంది. ఏఎల్‌పురం- కొంగసింగి, ఏఎల్‌పురం- పాతకృష్ణాదేవిపేట రహదారులు గోతులమయంగా మారడంతో వాటిలో వర్షపునీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికితోడు కృష్ణాదేవిపేట మీదుగా తాండవలో చేరుకునే బొడ్డేరు గెడ్డ పొంగి ప్రవహిస్తోంది.

మాకవరపాలెం : మండలంలో శనివారం అర్ధరాత్రి నుంచి వర్షం కురుస్తుండడంతో కాలువలు, చెరువులు నీటితో నిండాయి. గ్రామాల్లో మురుగు కాలువల్లో పూడికలు తీయకపోవడంతో వర్షపు నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. మాకవరపాలెం బస్‌స్టాండ్ వర్షానికి బురదగా మారింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే ఎగువ ప్రాంతం నుంచి వర్షపు నీరు భారీగా చేరడంతో సర్పానది ఉధృతంగా ప్రవహిస్తుంది.

భక్తి శ్రద్ధలతో వినాయక చవితి


నర్సీపట్నంలోని అయ్యరక వీధిలో వినాయక విగ్రహం వద్ద రాజేశ్ తదితరులు

నర్సీపట్నం, సెప్టెంబరు 8 : వినాయక చవితి వేడుకను నియోజకవర్గ ప్రజలు శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వీధి వీధినా వివిధ రూపాల్లో స్వామి కొలువుదీరారు. మునిసిపాలిటీలోని అయ్యరక వీధి, వెంకునాయుడుపేట, రామారావుపేట, కొత్తవీధి, వెలమవీధి, గవరవీధి, శివపురం, పీనారిపాలెం, సిటీ క్లబ్, ట్యాక్సీ స్టాండ్, పెదబొడ్డేపల్లి, బలిఘట్టం బీసీ కాలనీలో ఈ వేడుకలు మరింత ఘనంగా జరుగుతున్నాయి. 25వ వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేశ్ మహా గణపతిని దర్శించుకున్నారు. అబీద్ సెంటర్‌లో అయ్యరక వీధి నూకాంబికా యూత్ ఆధ్వర్యంలో 21 అడుగుల భారీ మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

గొలుగొండ/ కృష్ణాదేవిపేట : వినాయక చవి తిని మండలంలో ఘనంగా జరుపుకున్నారు. గొలుగొండ, కొత్తజోగంపేట, జోగంపేట. శ్రీరాంపురం, ముంగర్లపాలెం, ఏటిగైరంపేట, పాతమల్లంపేట, పాకలపాడు, చీడిగుమ్మల, కరక, కశిమి, గుండుపాల, ఏఎల్‌పురం, చోద్యం, పాతకృష్ణాదేవిపేట , సీహెచ్‌నాగాపురం, కొంగశింగి, లింగంపేట, విప్పలపాలెం తదితర గ్రామాల్లో వీధివీధిన వివిధ రూపాల్లో స్వామి విగ్రహాలను ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుంటున్నారు.

మాకవరపాలెం : మండలంలో వినాయక చవితిని అత్యంత భక్తిశ్రద్ధలతో జరపుకున్నారు. మాకవరపాలెం, తామరం, రాచపల్లి కొడంల అగ్రహారం, తామరం తదితర గ్రామాల్లో వీధివీధిన స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు.

పండగపూట విషాదం

... 5వ పేజీ తరువాయి

పట్టణంలోని కనోసా స్కూల్ ఎదుట జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం తుని వైపు వెళుతున్న ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి వస్తున్న లారీ బలంగా ఢీకొన్నది. దీంతో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న కాకినాడ జిల్లా తుని మండలం రేఖవానిపాలెం గ్రామానికి చెందిన కొల్లాపూర్ రమణ(25) అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ రెండు సంఘటనలపై కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ అప్పన్న తెలిపారు.

బైక్‌లు ఢీకొని యువకుడి మృతి

రావికమతం: మండలంలోని మత్స్యవానిపాలెం కాటా వద్ద బీఎన్ రోడ్డులో శనివారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఒక యువకుడు మృతిచెందగా మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. కొత్తకోట ఎస్‌ఐ లక్ష్మణరావు తెలిపిన వివరాల ప్రకారం.. రావికమతం మండలం టి.అర్జాపురం గ్రామానికి చెందిన అద్దేపల్లి రామరాజు(28), మత్స రామునాయుడు శనివారం రాతి దొండపూడి వెళ్లి ద్విచక్రవాహనంపై ఇంటికి తిరిగి వస్తున్నారు. ఇదే గ్రామానికి చెందిన కొశిరెడ్డి సువర్ణరాజు, పేరపు శివ అర్జాపురం నుంచి దొండపూడి వైపు ద్విచక్రవాహనంపై వెళుతున్నారు. దారిలో మత్స్యవానిపాలెం పాల్గుణ కాటా వద్ద ఎదురెదురుగా వచ్చిన బైకులు బలంగా ఢీకొన్నాయి. దీంతో నలుగురూ తీవ్రంగా గాయపడడంతో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. రామరాజు పరిస్థితి విషమంగా వుండడంతో వైద్యుల సూచన మేరకు విశాఖ కేజీహెచ్‌కు తరలిస్తుండగా దారిలో మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ లక్ష్మణరావు తెలిపారు.

కుండపోత!


రావికమతం మండలం మేడివాడలో భారీ గోతులతో నిండిన ప్రధాన రహదారి

... 5వ పేజీ తరువాయి

అప్రమత్తమైంది. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అవసరం మేరకు ప్రజలకు సేవలందించేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను (ఫోన్ నంబర్లు 08924-226599, 08924-222888) ఏర్పాటు చేసి, మండలాల నుంచి వర్షాలు, ప్రజల ఇబ్బందులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. మండల అధికారులు ఆయా కేంద్రాల్లోనే అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి సిబ్బందిని అందుబాటులో ఉంచారు.

74 మి.మీ.ల వర్షం

జిల్లాలో శని, ఆదివారాల్లో సగటున 74 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. శనివారం ఉదయం 8 గంటల నుంచి ఆదివారం ఉదయం 8 గంటల వరకు సగటు వర్షపాతం 12.8 మిల్లీ మీటర్లు కాగా ఆదివారం ఉదయం నుంచి సాయత్రం 5 గంటల వరకు 61.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. రెండు రోజులు కలిపి అత్యధికంగా దేవరాపల్లి మండలంలో 128 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కశింకోట మండలంలో 100 మిల్లీ మీటర్లు, ఎలమంచిలిలో 92.7, రావికమతంలో 87.2, పాయకరావుపేటలో 83.6, పరవాడలో 83.3, ఎస్.రాయవరంలో 83, కె.కోటపాడులో 79.5, మునగపాకలో 79.5, సబ్బవరంలో 77.6, అనకాపల్లిలో 75.3, చోడవరంలో 74, నక్కపల్లిలో 71.5, అచ్యుతాపురంలో 70.4, గొలుగొండలో 68.6, చీడికాడలో 68.6, రోలుగుంటలో 68.8, కోటవురట్లలో 65.1, మాడుగులలో 64.4, రాంబిల్లిలో 59.6, నాతవరంలో 57, మాకవరపాలెంలో 53.9, నర్సీపట్నంలో 45.9, బుచ్చెయ్యపేటలో 41.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

రహదారులు జలమయం

- రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తం
- వాహనదారులకు తప్పని ఇబ్బందులు


వర్షం నీటిలో నిండిన చోడవరం చీడికాడ రోడ్డు


బుచ్చెయ్యపేట : వడ్డాదిలో ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దేరు


మాడుగుల రూరల్ : బురదమయంగా తయారైన రోడ్డు

చోడవరం, సెప్టెంబరు 8 : వాయుగుండం నేపథ్యంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో ముసురు వాతావరణం నెలకొంది. కొన్ని పంచాయతీల్లో శనివారం రాత్రి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సిబ్బంది వెంటనే స్పందించి సరఫరా పునరుద్ధరించారు. పంటపొలాల్లోకి వర్షం నీరు చేరింది. ఇదే పరిస్థితి మరో రెండు, మూడు రోజులు కొనసాగితే పంటపొలాలు నీటిముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, పట్టణంలోని కో-ఆపరేటివ్ కాలనీ, బాలాజీ నగర్, రెల్లి కాలనీ, పూర్ణా థియేటర్, బానయ్య కోనేరు తదితర ప్రాంతాలు నీటిముంపులో చిక్కుకున్నాయి. పూర్ణా థియేటర్ లోనికి పూర్తిగా వర్షం వచ్చి చేరింది. వర్షం విరామం లేకుండా పడుతుండడంతో వాననీరు బయటకు పోయేదారి లేక కాలనీలు నీటిముంపులో ఉండిపోయాయి. ఇంటి పరిసరాలు నీటిముంపులో ఉండిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రావికమతం : గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు భీమునిపట్నం-నర్సీపట్నం రోడ్డు అధ్వానంగా మారింది. రావిమతం నుంచి మేడివాడ పెద్ద చెరువు వరకూ అడుగడుగునా రోడ్డు ముంపునకు గురైంది. దీంతో ఈ రోడ్డులో రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మత్స్యవానిపాలెం నుంచి కొత్తకోట వరకూ రోడ్డు దారుణంగా ఉంది. ముఖ్యంగా రావికమతం మేడివాడ పెద్ద చెరువు వరకూ నాలుగు కిలోమీటర్లు, కొత్తకోట నుంచి బంకు వరకూ దాటాలంటే గంటల సమయం పడుతోందని వాహనచోదకులు వాపోతున్నారు.

మాడుగుల రూరల్ : మండలంలోని గ్రామాల్లో ఆదివారం కుండపోత వర్షం పడింది. శనివారం రాత్రి నుంచి చిరుజల్లుల వర్షం పడుతూ క్రమేపీ వర్షం జోరందుకుంది. అల్పపీడన ద్రోణి ప్రభావంతో వర్షాలు ఆగకుండా పడుతూనే ఉన్నాయి. వరిపొలాల్లోకి వర్షం నీరు చేరింది. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. రోడ్లపై ఏర్పడిన గుంతల్లో వర్షం నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. వర్షం కారణంగా విద్యుత్ సరఫరాలో అడపాదడపా అంతరాయం ఏర్పడింది. దీంతో వినియోగదారులు ఇబ్బంది పడ్డారు. ముసురు వర్షాలు వల్ల కూలి పనులు లేక కూలీలు అవస్థలు పడ్డారు.

రోలుగుంట : మండలంలో ఆదివారం తెల్లవారుజాము నుంచి వర్షం మొదలైంది. ఎడతెరిపి లేని వానలతో గ్రామాలు వరద నీటితో చిత్తడిగా మారాయి. రోడ్లపై ఉన్న గుంతల్లో నీళ్లు నిలిచాయి. కొన్ని గ్రామాల్లో సక్రమంగా డ్రైనేజీ లేకపోవడంతో రోడ్లపైనే వర్షపు నీరు ప్రవహిస్తోంది.


రోలుగుంట : శరభవరంలో డ్రైనేజీ సౌకర్యం లేక రోడ్డు మీద నుంచే ప్రవహిస్తున్న వర్షపు నీరు

మండల వ్యాప్తంగా 22.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ వరహాలు తెలిపారు.

చీడికాడ : గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని రహదారులు జలమయం అయ్యాయి. దీంతో వరహాపురం నుంచి పెద్ద గోగాడ వెళ్లే తారు రోడ్డు మధ్యలో వరహాపురం సమీపాన మొండిగెడ్డపై కాజ్‌వే లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉత్తర భాగాన అటవీ ప్రాంతం నుంచి మొండిగెడ్డ నుంచి ప్రవాహం అధిక కావడంతో రోడ్డుపై వర్షం నీరు పొంగిపొర్లుతున్నది. దీంతో సుమారు 10 గ్రామాలకు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ గెడ్డపై పూర్తి స్థాయిలో కాజ్‌వే నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని పలువురు కోరుతున్నారు.

బుచ్చెయ్యపేట : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మండలంలో వారం రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పల్లపు ప్రాంతాలు నీటమునిగాయి. వడ్డాది, తాచేరు, బొడ్డేరు నదులతో పాటు వాగులు, వంకలు, గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వర్షాలతో భీమునిపట్నం-నర్సీపట్నం (బీఎన్) రోడ్డులో రవాణా నరకప్రాయంగా మారింది. బీఎన్ రోడ్డులో వడ్డాది నుంచి రావికమతం వరకు బంగారుమెట్ట, ఎల్.సింగవరం, పొట్టిదొరపాలెం, బూదిరెడ్లపాలెం, కోమళ్లపూడి, విజయరామరాజుపేట కూడలి వద్ద పడిన గొయ్యిలు చెరువులను తలపిస్తుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


మాడుగుల రూరల్ : హైస్కూల్ కాలనీ సిద్ధి వినాయక ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం


బుచ్చెయ్యపేట : వడ్డాదిలో పూజలు చేస్తున్న భక్తులు

గణనాథుడికి ఘనంగా పూజలు

- వాడవాడలా వినాయక మండపాలు
- ప్రతి పల్లెలోనూ చవితి వేడుకల సందడి

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 8 : మండలంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వడ్డాది, విజయరామరాజుపేట, మంగళాపురం, లోపూడి, బంగారుమెట్ట, దిబ్బిడి, బుచ్చెయ్యపేట, రాజాం, తురకలపూడి, పెదమదీన, పెదపూడి, సీతయ్యపేట, గున్నెంపూడి, కొండపాలెం, కేపీఅగ్రహారం, కోమళ్లపూడి, పొట్టిదొరపాలెం తదితర గ్రామాల్లో మండపాలు నిర్మించి గణపతి నవరాత్రి వేడుకలు నిర్వహించారు. చిన్నాపెద్దా వినాయక పూజల్లో పాల్గొన్నారు. సాయంత్రం వేళల్లో మండపాలను చూసేందుకు జనం వీధుల్లోకి వచ్చారు. విద్యుత్ కాంతులతో మండపాలు ఆకర్షణీయంగా రూపొందించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కాగా, వర్షం కారణంగా మండపాల వద్ద నిర్వాహకులు కొంత ఇబ్బంది పడ్డారు.

రావికమతం : మండలంలో వినాయకచవితి పండగను శనివారం ఘనంగా నిర్వహించారు. రావికమతం, కొత్తకోట వినాయక ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.కొత్తకోట శివాలయం వీధిలో సిద్ధి వినాయక యూత్ యువకులు భారీ విగ్రహం ఏర్పాటు చేశారు. అలాగే చినపాచిలలో రెండు చోట్ల ఏర్పాటు చేసిన వినాయకుల విగ్రహాల వద్ద సెట్టింగ్‌లు పలువురిని ఆకట్టుకుంటున్నాయి.

దేవరాపల్లి : మండలంలోని అన్ని గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో వినాయక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలో భారీ సెట్టింగ్‌లతో వినాయక మండపాలు ఏర్పాటు చేశారు. సిద్ధి వినాయక, రామాలయం వద్ద, పెదరాయ సెంటర్, నాయుడు వీధి, లౌలీబాయస్ పలు చోట్ల విగ్రహాలు ఏర్పాటు చేశారు.

మాడుగుల రూరల్ : మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక చవితి పండగను శనివారం ఎంతో భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. యువకులు ఉత్సాహంతో తాటాకు చలువ పందిళ్లు వేసి మండపాలకు డెకరేషన్లు చేసి అందంగా తీర్చిదిద్దారు. మాడుగుల హైస్కూల్ కాలనీలో ప్రతిష్ఠ చేసిన ఏకైక సిద్ధి వినాయక ఆలయంలో ఘనంగా పూజలు చేశారు. మెగా ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో అయ్యప్ప రూపధారణలో వినాయకుడిని కొలువుంచి అయ్యప్పస్వామి గుడి నమూనా సెట్ వేశారు. వినాయక మండపాల ఏర్పాటుతో గ్రామాల్లో ఎక్కడ చూసినా పండగ సందడి నెలకొంది.

రోలుగుంట : మండలంలో శనివారం ఘనంగా వినాయక చవితి వేడుకలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా ఆలయాలకు తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీనిలో భాగంగానే కొవ్వూరులో మండల ఐటీడీపీ కన్వీనర్ బంటు రాజు ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. వాడవాడలా వెలిసిన మండపాల్లో గణనాథులను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు.

కె.కోటపాడు : వినాయక చవితి పర్వదినం సందర్భంగా మండల వ్యాప్తంగా శనివారం గణనాథునికి పూజలు నిర్వహించారు. పలుచోట్ల గణనాథుని విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. గ్రామాల్లోని పురవీధుల్లో నిర్వాహకులు విగ్రహాలు ఏర్పాటు చేయడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రోడ్డు కోసం వీరభద్రపేట గిరిజనుల వినూత్న నిరసన


బురదలో దిగి ఆందోళన వ్యక్తం చేస్తున్న గిరిజనులు

దేవరాపల్లి, సెప్టెంబరు 8 : మండలంలోని చింతలపూడి పంచాయతీ వీరభద్రపేట గిరిజనులు తమ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించకపోవడంపై బురదలో కూర్చొని నిరసన తెలిపారు. చింతలపూడికి వెళ్లే తారు రోడ్డుకు కిలోమీటరు దూరంలో ఉన్న వీరభద్రపేటకు మట్టి రోడ్డు ఉంది. చిన్న వర్షం పడినా బురదగా మారుతోందిన గ్రామసులు వాపోయారు. తమ గ్రామస్థులకు ఆరోగ్యం బాగా లేకపోయినా చాలా ఇబ్బందికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పిల్లలు బల్లిపురం, తామరబ్బ గ్రామాల్లో పాఠశాలకు వెళ్లాల్సి వస్తోందని, సరైన రోడ్డు సదుపాయం లేక వీరు ఇబ్బందులు పడుతున్నారన్నారు ఈ క్రమం లో శనివారం గిరిజనులు బురదలో కూర్చొని నిరసన తెలిపారు. కనీసం గ్రావెల్‌రోడ్డు అయినా వేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.వెంకన్న వీరికి మద్దతు తెలిపారు.

రోడ్డుపై ప్రమాద హెచ్చరికలు

ఓ ఉపాధ్యాయుడి ఔదార్యం


రోడ్డుపై హెచ్చరికగా జెండాలు అందజేస్తున్న దృశ్యం

చోడవరం, సెప్టెంబరు 8 : భారీ వర్షాలకు మండల పరిధిలోని అధ్వాన స్థితికి చేరిన బీఎన్ రోడ్డులోని ప్రమాదకర గుంతల వద్ద ఎర్ర జెండాలతో కూడిన ప్రమాద హెచ్చరికలను మండలానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆదివారం ఏర్పాటు చేశారు. వాహనదారులు ప్రమాదాల బారిన పడుతుండడంతో వెంకన్నపాలేనికి చెందిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు గోవింద్ కొందరు యువకులతో కలిసి వెంకన్నపాలెం జంక్షన్ నుంచి వడ్డాది రోడ్డు వరకూ ప్రధాన రహదారిలో ప్రమాదకరమైన ఆరుచోట్ల గుంతల వద్ద ఎర్రజెండాలు పాతారు. వర్షాల వల్ల వాహనదారులు ప్రమాదాలకు గురి కాకుండా ఉండేందుకు ఈ విధంగా ఏర్పాటు చేసినట్టు గోవింద్ తెలిపారు.

ఘనంగా స్వయంభూ వినాయకుని ఉత్సవాలు

- రెండో రోజు హరిద్రవ పసుపు వర్ణ అలంకరణలో గణపతి

చోడవరం, సెప్టెంబరు 8: ఉత్తరాంధ్రలో పేరొందిన స్థానిక స్వయంభూ విఘ్నేశ్వర ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలను స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు చలపతి, శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఉప్పల సతీష్, ఇతర కమిటీ సభ్యులు, ఈవో సత్యనారాయణ పాల్గొన్నారు

హరిద్రవర్ణ పసుపు అలంకరణలో స్వయంభూ గణపతి

గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగం గా ఆదివారం స్థానిక స్వయంభూ గణేశుడు హరిద్రవర్ణ పసుపు అలంకరణలో భక్తులకు దరమ్శనమిచ్చారు. గణపతిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని, పూజలు నిర్వహించారు.

వైద్య సేవా కార్యక్రమాలకు ప్రోత్సాహం : ఎమ్మెల్యే రాజు

చోడవరం, సెప్టెంబరు 8 : గ్రామాల్లో వైద్యసేవా కార్యక్రమాలకు ప్రోత్సాహం అందించనున్నామని స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. ఆదివారం మండలంలోని వెంకన్నపాలెంలో ఉరుకుటి పెదరామునాయుడు ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా నేత్ర వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యసేవా కార్యక్రమాలకు తన సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. ఈ శిబిరంలో 150 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి, 40 మందిని శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. ఈ కార్యక్రమంలో మాడుగుల టీడీపీ నియోజకవర్గం నాయకులు పైలా ప్రసాదరావు, ఎంపీటీసీ సభ్యుడు మురుకుటి రమణ, బూర అప్పలరాజు, జోగ వెంకట రమణ, శంకర్‌ఫౌండేషన్ డాక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.


వైద్య శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజు